ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	584.80 (296.8580)	3,75,178	1,96,027
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.66 (3.61)	54.74	557.28
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	131.88 (7.10)	67,112	32,390

చికెన్ ధరలు | లైవ్ : రూ.100 | డ్రెస్ : రూ.150 | స్కిన్‌లెస్ : రూ.170

సాగర్ నుంచి సాగరం వైపునకు
కృష్ణమ్మ



- ఏడాది విరామం తరువాత ఉరకలేస్తూ పరుగులు
- నాగార్జునసాగర్ 20 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
- ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో పనిచేయని 2, 4వ నంబర్ టర్బైన్లు
- 2018లో గేట్ల ఆపరేటింగ్‌కు ఏర్పాటు చేసిన సెన్సార్ సిస్టం వృథా

మహాబలేశ్వరంలో పుట్టి.. కొండా కోనలు.. వాగులు వంకలు దాటుతూ.. అన్నదాతల ఆశల సౌధాలు అల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులను నింపి.. బిడ్డల పరవశాన్ని ఒడిన నింపుకొని నాగార్జునసాగర్‌కు చేరుకున్న కృష్ణమ్మ.. సాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తడంతో సాగరం వైపునకు పరుగులిడుతోంది. ఏడాదిగా బోసిపోయిన నది, పరీవాహక ప్రాంతమంతా ఒక్కసారిగా కృష్ణమ్మ గలగలలతో పులకరించింది. ఒంపులు తిరుగుతూ.. సవ్వడులు చేస్తూ.. కృష్ణమ్మ నాగార్జునసాగర్ నుంచి 21కిలోమీటర్ల దూరంలో ఉన్న టెయిల్‌పాండ్‌కు,అక్కడి నుంచి 18కిలోమీటర్ల దూరంలో ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోంది. పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో 149కిలోమీటర్ల దూరం ప్రయాణించి.. వేల కిలోమీటర్లు అలుపెరగని ప్రయాణంతో అలసి సొలసిన కృష్ణమ్మ ఏపీ రాష్ట్రం ప్రకాశం బ్యారేజీకి చేరుకొని హంసల దీవి వద్ద సముద్రంలో ఏకమవుతుంది.

\- నాగార్జునసాగర్

సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.5050 టీఎంసీలు) కాగా, సోమవారం రాత్రికి 584.60 అడుగులు(296.2810టీఎంసీలు)గా ఉంది. ఎగువ నుంచి 3,75178 క్యూసెక్కుల వరద వస్తోంది. సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ నారాయణరెడ్డి, ప్రాజెక్టు సీఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లికార్జున్‌రావు ప్రాజెక్టు అధికారులతో కలిసి తొలుత ఆరు క్రస్ట్‌గేట్లను స్విచ్ ఆన్ చేసి ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో 546 అడుగులు ఎత్తు నుంచి కృష్ణమ్మ తెల్లని పాలపొంగుల నురగలు కక్కుతూ దిగువకు ఉరకలేసింది. గత ఏడాది సాగర్‌కు ఎగువ నుంచి వరద లేకపోవడంతో క్రస్ట్‌గేట్లను ఎత్తలేదు. కాగా, సోమవారం ఉదయం 10 గంటలకు ఆరు క్రస్ట్‌గేట్లను ఎత్తిన అధికారులు, క్రమంగా గేట్ల సంఖ్యను పెంచుతూ సాయంత్రం 7 గంటల సమయానికి 16 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తారు. రాత్రి 10 గంటలకు మరో నాలుగు గేట్లు ఎత్తి మొత్తం 20గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,50,580 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా, సోమవారం రాత్రి 10 గంటలకు 584.80 అడుగులు (296.8580 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 8,221 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,325 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,501 క్యూసెక్కులు, 20 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,50,580 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ నుంచి మొత్తం 1,96,027 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లను 12 అడుగుల మేరకు ఎత్తి, అలాగే రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేయడం ద్వారా మొత్తం 3,75,178 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.



స్విచ్ ఆన్ చేస్తున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

పనిచేయని ఆటోమెటిక్ గేట్ల ఆపరేటింగ్ సిస్టం



సెన్సార్

సాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తేందుకు 2018లో రూ.5కోట్ల వ్యయంతో ఆటోమెటిక్ సెన్సార్ సిస్టంను ఏర్పాటు చేశారు. కానీ, ఈ విధానం తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో వినియోగించడం లేదు. 2018 తర్వాత 2019, 2020, 2021, 2022లో వరుసగా నాలుగేళ్లు క్రస్ట్ గేట్లను మ్యానువల్‌గానే ఎత్తారు. దీంతో కోట్ల రూపాయలు వృథా అయ్యాయి. టెక్నాలజీ యుగంలోనూ పాత పద్ధతిలో గేట్లను ఆపరేట్ చేస్తుండటంతో ఒక్కోసారి మొరాయించే అవకాశం ఉంది. 2022లో క్రస్ట్ గేట్లను ఎత్తే క్రమంలో 1వ నంబర్ గేటు మొరాయించింది. అప్పటికప్పుడు ప్రాజెక్ట్ అధికారులు మరమ్మతులు చేయించి గేటును పైకి ఎత్తారు. కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ సెన్సార్ సిస్టంను ఇప్పటికైనా అందుబాటులోకి తీసుకురావాలని నీటిపారుదలశాఖ నిపుణులు కోరుతున్నారు.

జలవిద్యుత్ కేంద్రంలో పనిచేయని 2, 4వ టర్బైన్లు



సాగర్‌కు వారం రోజులుగా వరద రాక ప్రారంభం కాగా, గత నెల 29వ తేదీ నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని జెన్‌కో అధికారులు ప్రారంభించారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉండగా, అందులో 1వ నంబరు టర్బైన్ బీహెచ్ఈఎల్ (ఇండియా)కు చెందినది కాగా, మిగిలిన ఏడు టర్బైన్లు జపాన్ దేశం నుంచి వచ్చినవి. ఎనిమిది టర్బైన్లలో 2, 4వ నంబరు టర్బైన్ మరమ్మతులకు గురై ఆరు నెలలు గడుస్తోంది. కాగా, నేటికీ జెన్‌కో అధికారులు మరమ్మతులు పూర్తి చేయలేదు. ప్రస్తుతం ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నా, ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి అవకాశం లేకుండా పోయిందని నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద లేకపోవడంతో కేవలం 167మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను మాత్రమే ఉత్పత్తి చేశారు. అయితే టర్బైన్ల మరమ్మతులకు జపాన్ నుంచి నిపుణులు రావాల్సి ఉందని, అందుకే ఆలస్యమైందని జెన్‌కో ఎస్ఈ రఘురాం తెలిపారు.

ఆయకట్టుకు సాగునీరు : నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి •7లో..

సరిహద్దు చెక్‌పోస్టులో పటిష్ఠంగా తనిఖీలు: ఎస్పీ



రామాపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేట క్రైం, ఆగస్టు 5 : జిల్లా సరిహద్దు ప్రాంతాల్లోని చెక్ పోస్టుల వద్ద పటిష్ఠంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అంతటా ఈ నెల 3వ తేదీ సాయంత్రం నుంచి 4వ తేదీ ఉదయం వరకు నాఖాబందీ నిర్వహించామన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద, తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో, మద్దిరాల మండలం కుంటపల్లి వద్ద, మోతె మండల పరిధిలో మామిళ్లగూడెం వద్ద, నూతనకల్ మండలం టిక్కుమళ్ల వద్ద, అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం 12 గంటల్లోనే జిల్లావ్యాప్తంగా 2,124 వాహనాలను తనిఖీ చేసినట్లు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో 30 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, 252 పశువులు, 28 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్ల యజమానుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన సూర్యాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముగ్గురు కానిస్టేబుళ్లను ఎస్పీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఎం బాలకృష్ణ, ఎల్ పూర్ణచందర్, ఎం రాంబాబు డబ్బులు వసూలుచేశారని ఫిర్యాదులు అందడం, విచారణలో నిజమేనని నిర్ధారణ కావడంతో వారిని సస్పెండ్ చేశారు

ఎత్తిపోతల పనుల్లో ఆలస్యమేంటి?

- 15 రోజుల్లో కోదాడలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన
- రహదారుల విస్తరణ పనులు వెంటనే పూర్తిచేయాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ, ఆగస్టు 5 : వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎత్తిపోతల పథకాల పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోగా ఎత్తిపోతల మరమ్మతులను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు సంబంధించిన ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, విద్య, వైద్య, ఆరోగ్యశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులిచింతల నుంచి ముక్త్యాల కాల్వకు నీరు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు అందుకు సహకరించి అవసరమైన భూమిని ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు. భూములిచ్చిన రైతులకు సరైన ధర ప్రభుత్వం ఇస్తుందన్నారు. పైపులు వేసిన తర్వాత రైతులు తిరిగి భూమిని సేద్యం చేసుకోవచ్చన్నారు. ఎత్తిపోతల పథకాల పైపులు పగులగొట్టినా పట్టించుకోరా అని ఇరిగేషన్ డీఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగర్ ఎడమకాల్వ ద్వారా ముందుగా చెరువులు నింపాలని సూచించారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో రూ.232 కోట్లతో రహదారుల విస్తరణకు అనుమతులు వచ్చాయని, పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. మునగాల మండలానికి కొత్త అంబులెన్స్‌ను ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరు చేస్తామన్నారు. 15 రోజుల్లో కోదాడలో 100పడకల ఆసుపత్రికి నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఆర్‌అండ్‌బీ అధికారి కనకరత్నం, ఎస్ఈ రమేష్, ఆర్డీవో సూర్యానారాయణ, శ్రీనివాస్, డీఈవో అశోక్, డీఎంహెచ్‌వో కోటా చలం, మాజీ ఎమ్మెల్యే చందరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ ప్రమీల, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, కందుల కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కోదాడలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

దేశ ఆర్థికవ్యవస్థలో రవాణారంగమే కీలకం

కోదాడ టౌన్ : దేశవ్యాప్త ఆర్థిక వ్యవస్థలో రవాణా రంగానిదే కీలకపాత్ర అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన కోదాడ లారీ అసోసియేషన్ స్వర్ణోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఆల్ ఇండియా అసోసియేషన్ నాయకులు మంత్రిని ఘనంగా సన్మానించారు. అంతకు ముందు వేడుకలను, బీఎస్ సిక్స్ వాహనాల ప్రదర్శనను ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో కోదాడ అసోసియేషన్ అధ్యక్షుడు కనగాల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ చైర్మన్ షణ్ముగప్ప, సౌత్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వైస్‌ప్రెసిడెంట్ అరవింద్, అప్పాజీ, ఏపీ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌నాయుడు, అంజిరెడ్డి, రామినేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ఆవుల రామారావు, నరసయ్య, నరసరాజు, పెద్ది అంజయ్య, అశోక్ లేలాండ్ ఆర్ఎం నరేష్, ఎంవీ రమేష్, లారీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్

మఠంపల్లి : రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి 24గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని బక్కమంతులగూడెంలో రూ.2.5కోట్లతో నిర్మించే 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. సుల్తాన్‌పురతండా, చెన్నాయిపాలెం గ్రామాలకు సబ్‌స్టేషన్లు మంజూరు జరిగిందని, త్వరలో వినియోగంలోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, జడ్పీ సీఈవో వీవీ అప్పారావు, టీఎస్ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సీహెచ్ పాల్ రాజ్, డీఈలు వెంకటకృష్ణయ్య, డాలినాయుడు, ఈఈ కృష్ణారెడ్డి, తహసీల్దార్ మంగా రాథోడ్ పాల్గొన్నారు. రూ.107 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

స్వచ్ఛదనం-పచ్చదనంతో ఆరోగ్యం, ఆనందం: కలెక్టర్

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మండలంలోని బక్కమంతులగూడెం గ్రామంలో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, జడ్పీ సీఈవో వీవీ అప్పారావు, మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి, తహసీల్దార్ మంగా పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై తీర్పు హర్షనీయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

సూర్యాపేట , ఆగస్టు 5 : ఎస్సీల వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయమని, తీర్పును తమ పార్టీ స్వాగతిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం సూర్యాపేటలోని మల్లు వెంకటనరసింహారెడ్డి భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవో తీసుకువచ్చారని గుర్తుచేశారు. కొన్నేళ్ల పోరాటం ఫలితంగా వర్గీకరణకు చట్టబద్ధత లభించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరిలో మరింత వెనుకబడిన కులాలకు విడివిడిగా కోటాలు ఇచ్చుకోవడానికి అనుమతించడం సానుకూలమైన అంశమన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. అమలుకు అవసరమైన అన్నిరకాల చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రిజర్వేషన్ ఫలాలు అన్నివర్గాలకు దక్కాలంటే బీసీలలో వర్గీకరణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో రైతుల రుణాలను మాఫీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. రేషన్‌కార్డు ఆధారంగా రుణమాఫీ చేస్తామని చెప్పడం సరికాదన్నారు. అన్ని బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా కొన్ని హామీలను మాత్రమే అమలుచేసిందని, మిగతా హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలను కలుపుకొని ఎక్కువ స్థానాల్లో ప్రజాప్రతినిధులను గెలిపించుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మీ, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపెళ్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, నగరపు పాండు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



ఆర్డీవో వేణుమాధవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక నాయకులు


సూర్యాపేట టౌన్ / సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 5 : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక నాయకులు కందుల రమేష్, చలమల్ల నర్సింహ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలిపి, మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్రంకోసం జీవితంత్యాగం చేశారన్నారు.తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పదేళ్లు పూర్తయినా ఉద్యమకారులకు సరైన గుర్తింపు దక్కలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు మామిడిశెట్టి అంజయ్య, మీర్‌అక్బర్, బారీ ఖాన్, వెంకన్న, దొండ శ్రీను, ఎస్‌కె. యూసుఫ్, సికిందర్, బాబా, మార్గం రవీందర్, సంజయ్, రాజు, శంకర్, లింగయ్య, వాసుదేవ్, గోవర్థన్, ఠాకూర్ పాల్గొన్నారు.

కానరాని పొగ.. దోమలు పొగా

- వార్డుల్లో కనిపించని ఫాగింగ్
- కొత్తగా గ్రామాల్లో దోమల నివారణకు బ్యాటరీ స్ప్రేయర్లు

వానాకాలం కావడంతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. సరైన మురుగునీటి పారుదల సౌకర్యాలు లేక వీధుల్లో నీటి నిల్వలు పేరుకుపోతున్నాయి. వీటిని దోమలు ఆవాసాలుగా మార్చుకోవడంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. జిల్లాలో దోమల నియంత్రణ చర్యలు అంతంత మాత్రంగా చేపడుతున్నారు. ముఖ్యంగా దోమల నివారణకు ఉపయోగించే ఫాగింగ్‌ను విస్మరించారు. సరిపోను యంత్రాలు లేకపోవడం ఒకటైతే, ఉన్న వాటిని సక్రమంగా వినియోగించలేకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన యంత్రాల లక్ష్యం నెరవేరకుండా పోతోంది.

\- సూర్యాపేటటౌన్



సూర్యాపేటలో మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది



సూర్యాపేటలో ప్రధాన వీధిలో ప్రవహిస్తున్న మురుగునీరు

ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీటిలో దోమలు వృద్ధి చెంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అంతటా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షానికి కూడా ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాల్లో నీరు చేరుతోంది. అందులో దోమలు వృద్ధితో పాటు దుర్వాసన వస్తోంది. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించింది. సాయంత్రం తలుపు తెరిస్తే చాలు దోమలు ఇంటి నిండా చేరుతున్నాయి. శివారు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో గడ్డిదోమలు కూడా వస్తున్నాయి. దీంతో ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు, పలువ్యాధుల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు.

గ్రామాలకు బ్యాటరీ స్ప్రేయర్లు

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు దోమల బారిన పడకుండా జడ్పీ ఆధ్వర్యంలో బ్యాటరీ స్ప్రేయర్లను కొనుగోలుచేశారు. ప్రతీ మండలానికి నాలుగు స్ప్రేయర్లను అందజేస్తున్నారు. జిల్లాలోని 23 మండలాలకు 92 స్ప్రేయర్లను కొనుగోలుచేశారు. ఒక్కో స్ప్రేయర్‌కు రూ.5వేల చొప్పున మొత్తం రూ.4.60 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం బ్యాటరీ స్ప్రేయర్లను ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. దోమలు అధికంగా ఏ గ్రామంలో ఉన్నాయో గుర్తించి అక్కడ బ్యాటరీ స్ప్రేయర్లను వినియోగించాలి. ఆ తర్వాత ఎంపీడీవో కార్యాలయానికి చేరవేయాలి. అయితే తీసుకెళ్లి, తీసుకువచ్చేందుకు పంచాయతీ సిబ్బంది ఆసక్తి చూపించడంలేదు.

మునిసిపాలిటీల్లో ఖర్చు ఎక్కువ.. ఫలితం తక్కువ

మునిసిపాలిటీల్లో యంత్రాలు కొనుగోలు చేస్తున్నారే తప్ప వాటిని వినియోగించిన దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. రూ.లక్షల్లో ఫాగింగ్ మిషన్లను కొనుగోలు చేసినప్పటికీ యంత్రాలను వాడడంలేదు. జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల్లో ప్రతీ ఏడాది ఫాగింగ్ నిర్వహణకు రూ.30లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. దోమల నివారణతో మలాథియన్ ద్రావణం వాడుతుంటారు. పెట్రోల్, డిజిల్‌లో మలాథియన్ మిశ్రమం కలిపి ఫాగింగ్ చేయాలి. ఇదేమీ పాటించకుండా ఇష్టానుసారంగా వాడడంతో మరమ్మతులకు గురవుతున్నాయి. సూర్యాపేట మునిసిపాలిటీలో ఏడాదికి రూ.3.50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. సున్నం, బ్లీచింగ్ కోసం రూ.4.50లక్షల దాకా ఖర్చు చేస్తున్నారు. ఇంత ఖర్చు చేసినా దోమలు తగ్గడంలేదు. దోమల బెడదను తప్పించుకోవడానికి పట్టణంలోని చాలా కుటుంబాలు నెలకు రూ.500 దాకా ఖర్చు చేస్తున్నారు. మస్కిటో కాయిల్స్, లిక్విడేటర్స్ వాడుతున్నారు. సూర్యాపేట శివారు ప్రాంతాల్లోని అంజనాపురికాలనీ, మానసనగర్, హైటెక్ కాలనీ, స్నేహనగర్, భగత్‌సింగ్‌నగర్‌లో, తాళ్లగడ్డతో పాటు చాలాచోట్ల మురుగుకాల్వలు లేక మురుగునీరు ఇళ్ల మధ్యనే చేరుతోంది. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో అడపదడపా ఫాగింగ్ చేస్తున్నా ప్రయోజనం ఉండటం లేదు.

మునిసిపాలిటీ	స్ప్రేయర్లు	ఫాగింగ్
	(యంత్రాలు)	
సూర్యాపేట	40	5
కోదాడ	4	3
తిరుమలగిరి	1	1
హుజూర్‌నగర్	1	2
నేరేడుచర్ల	3	2

దోమల నివారణకు చర్యలు

దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలి. అన్ని వార్డుల్లో దశల వారీగా ఫాగింగ్ చేయిస్తున్నాం.

\- శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్,సూర్యాపేట

నిరంతరం మండలాల్లో పర్యటించాలి



ప్రజావాణిలో వీవోఏపై ఫిర్యాదుచేస్తున్న ధర్మాపురం గ్రామానికి చెందిన సంఘ బంధం మహిళలు

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 5 : మండల ప్రత్యేకాధికారులు నిరంతరం వారికి కేటాయించిన మండలాల్లో పర్యటించాలని సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు. ప్రజాపాలనకు సంబంధించిన గృహజ్యోతి, మహాలక్ష్మి, రెండో విడత రుణమాఫీకి సంబంధించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండలాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పద్మారావు, హేమమాలిని, శ్రీలత, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

ధర్మాపురం వీవోఏపై ఫిర్యాదు

పెన్‌పహాడ్ : మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన సంఘ బంధం-2 సభ్యులు వీవోఏపై ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. గ్రామంలో సంఘ బంధం ఏర్పాటైన నాటి నుంచి నేటివరకు వీవోఏ ఒక్కరే బాధ్యత వహిస్తున్నాడన్నారు. లావాదేవీల లెక్కలు చూపించాలని ఎన్నిసార్లు అడిగినా ఖాతరు చేయడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే జిల్లా నుంచి ఆడిటర్లను పంపించి మహిళల సమక్షంలో పూర్తి విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ బంధం అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, సుమలత, సభ్యులు సుజాత, ఈశ్వరమ్మ, దుర్గ, భవానీ పాల్గొన్నారు.

మూడు ఇసుక లారీల పట్టివేత

కోదాడ రూరల్, ఆగస్టు 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా మూడు లారీల్లో ఇసుకను తరలిస్తుండగా సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా లారీల్లో తరలిస్తున్న ఇసుకను గుర్తించి సీజ్ చేసి మైనింగ్ శాఖకు అప్పగించినట్లు తెలిపారు. ఇసుక తరలిస్తున్న డ్రైవర్లు, ఓనర్లు షేక్ రసూల్, షేక్ అఫ్రోజ్, తాటి కొండల్‌రావు, పాములపాటి సీతారామయ్య, షేక్ మహ్మద్ రఫీలపై కేసు నమోదు చేశారు.

హరిహరులకు విశేష పూజలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, ఆగస్టు 5: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవార్లకు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.17,80,292 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరీశుడిని భూగర్భ, గనుల శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, సీఎం చీఫ్ పీఆర్వో బోరెడ్డి ఆయోధ్యరెడ్డి, కవి, రచయిత అందెశ్రీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కనగల్, ఆగస్టు 5: నల్లగొండ జిల్లా కనగల్ మండలకేంద్రంలోని ఓ ఇంట్లో నిల్వ చేసిన 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్, కనగల్ పోలీసులు సోమవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పట్టుబడిన బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామానికి చెందిన కె. వెంకన్నపై కేసు నమోదు చేశారు. పేదల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విష్ణు హెచ్చరించారు.

ఆయకట్టు రెండు పంటలకు సాగునీరు

● నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తి నీరు విడుదల చేసిన కలెక్టర్

నాగార్జునసాగర్, ఆగస్టు 5: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది ఆయకట్టు రెండు పంటలకు సాగునీరు అందిస్తామని నల్లగొండ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. నాగార్జుసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం పూర్తి స్థాయికి చేరువలో ఉన్నందున సోమవారం మధ్యాహ్నం క్రస్ట్ గేట్లను స్విచ్ఛాన్ చేసి ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 8క్రస్టగేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని, సాయంత్రానికి 14 క్రస్టగేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తినీటిని దిగువకు విడుదల చేస్తామని తెలిపారు. ఇప్పటికే సాగర్ ఎడమ కాల్వ సాగునీటి కోసం నీరు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఆయకట్టులో రెండు పంటలకు ఎలాంటి ఆటంకం లేకుండా సాగునీరు అందుతుందని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎక్కడైనా కాల్వలు బలహీనంగా ఉంటే గుర్తించి మరమ్మతులు చేయిస్తామన్నారు. అందుకే ప్రస్తుతం కాల్వలకు కొద్దికొద్దిగా నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. మరో నాలుగైదు రోజుల్లో ఎడమ కాల్వకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేస్తామన్నారు. ఎడమ కాల్వ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను నింపుతామన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వచ్చే వరదను బట్టి సాగర్ గేట్ల సంఖ్యను పెంచి మరింత నీటిని దిగువకు విడుదల చేస్తామన్నారు. సాగర్ క్రస్టగేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నందున నది పరీవాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లి ఖార్జున్‌రావు, డీఈ శ్రీనివాస్, జేఈ కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి : సీఈ నాగేశ్వర్‌రావు

16 క్రస్ట్ గేట్ల ద్వారా 1,20,064క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,804 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వ ద్వారా 8259 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 4949 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,64,376 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లను 12 అడుగుల మేరకు ఎత్తి, రెండు జలవిద్యుత్ కేంద్రాలల్లో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 3,75,178 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను సోమవారం ఎత్తడంతో సాయంత్రం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకుల కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు వచ్చారు. సాగర్ ప్రధాన డ్యాం పైకి ఎవరికీ అనుమతి లేకపోవడంతో పర్యాటకులు ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారిలో నిల్చోని క్రస్ట్ గేట్ల నుంచి కిందికి దూకుతున్న కృష్ణమ్మ అందాలను తిలకిస్తున్నారు. మంగళవారం నుంచి పర్యాటకుల రాక పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానడ్యాం వద్దకు రాకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాగర్ నుంచి సాగరం వైపు...





నాగార్జునసాగర్‌కు చేరుకున్న కృష్ణమ్మ.. సాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తడంతో సాగరం వైపునకు పరుగులీడుతోంది. ఏడాదిగా బోసిపోయిన నది, పరీవాహక ప్రాంతమంతా ఒక్కసారిగా కృష్ణమ్మ గలగలలతో పులకరించాయి. నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను సోమవారం ఎత్తడంతో సాయంత్రం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకుల కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు సాగర్‌కు వచ్చారు. సాగర్ ప్రధాన డ్యాం పైకి ఎవరికీ అనుమతి లేకపోవడంతో పర్యాటకులు ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారిలో నిల్చోని క్రస్ట్ గేట్ల నుంచి కిందకు దూకుతున్న కృష్ణమ్మ అందాలను తిలకిస్తున్నారు. పర్యాటకులు ఎవరూ రాకుండా పోలీసు బందో బస్తు ఏర్పాటు చేయడంతో పాటు రోప్‌లు కట్టారు.



వాయనం ఇస్తున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



స్విచ్ ఆన్‌చేస్తున్న ప్రాజెక్టు సీఈ నాగేశ్వర్‌రావు



సాగర్ అందాలను తిలకించేందుకు వస్తున్న ఓ కుటుంబం



నిండుకుండలా నాగార్జునసాగర్ జలాశయం



నాగార్జునసాగర్ జలాశయంపై గస్తీ కాస్తున్న భద్రతా సిబ్బంది



సాగర్ అందాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న పర్యాటకులు

స్నేహితుల రోజున విషాదం

● కేక్ కట్‌చేసి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఒకరు ● బైక్‌పై అదుపుతప్పి మరొకరు మృతి

అర్వపల్లి, సంస్థాన్‌నారాయణపురం, ఆగస్టు 5: స్నేహితుల దినోత్సవం రోజు విషాదం నింపింది. కేక్ కట్‌చేసిన తర్వాత బైక్‌పై వస్తుండగా సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలకేంద్రంలో కారు ఢీకొని ఒకరు మృతిచెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామంలో బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి పడిపోయి మరొకరు మృతిచెందారు. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన లింగంపల్లి శ్రీనివాస్(49) స్నేహితుల దినోత్సవం సందర్భంగా తన అన్న కుమారులు లింగంపల్లి సైదులు, లింగంపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం రాత్రి అర్వపల్లిలో కేక్ కట్‌చేశారు. అనంతరం వేర్వేరు బైక్‌లపై ఇంటికి వెళ్తుండగా 356 జాతీయ రహదారిపై సూర్యాపేట నుంచి అతివేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. బైక్‌పై ఉన్న శ్రీనివాస్ సుమారు 20మీటర్ల వరకు ఎగిరిపడి తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. పక్కనే ఉన్న తమ ఇంటికి ఒక్క నిమిషంలో చేరుకునేలోపు ఈ ప్రమాదం జరిగింది. శ్రీనివాస్ 15ఏళ్లుగా 104 వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అర్వపల్లి ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.



శ్రీనివాస్(ఫైల్)

బైక్‌పై వెళ్తుండగా..

సంస్థాన్‌నారాయణపురం మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన మల్లెపల్లి రాంరెడ్డి-విజయలక్ష్మి దంపతుల కుమారుడు మల్లెపల్లి శ్రీకాంత్‌రెడ్డి(37) ఆదివారం గ్రామంలో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లాడు. స్నేహితులతో కలిసి సంతోషంగా గడిపాడు. తిరిగి రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడడంతో బండరాళ్ల తలకు అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి ఎవరూ గమనించలేదు. సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తున్న వ్యక్తి రోడ్డు పక్కన ప్రమాదానికి గురైన బైక్ గుర్తించి పక్కనే గుంతలో చూశాడు. అక్కడ శ్రీకాంత్‌రెడ్డి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్ తెలిపారు.



శ్రీకాంత్‌రెడ్డి(ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కొండమల్లేపల్లి, ఆగస్టు 5: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. పీఏపల్లి మండలం బాలాజీనగర్‌కు చెందిన మెగావత్ తావు(55) స్వగ్రామంలో కిరాణ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పక్షపాతానికి గురైన తావుకు ఒక చెయి మాత్రమే పని చేస్తుంది. ఒక్క చేతితోనే ఆటో నడుపుతుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కిరాణ సామాను తీసుకురావడానికి కొండమల్లేపల్లికి ఆటోలో వస్తుండగా కొండమల్లెపల్లి చౌరస్తా వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డ వచ్చింది. దీంతో అదుపు తప్పిన ఆటో డివైడర్‌ను ఢీకొంది. తావు తలకు తీవ్రగాయం కావడంతో చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. తావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. తావు కుమారుడు మెగావత్ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.



తావు(ఫైల్)

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

పెద్దవూర మండలం పోతునూరు గ్రామానికి చెందిన జెనిగల మల్లేష్(25) కొండమల్లేపల్లి మండలకేంద్రంలో గల ట్రాక్టర్ షోరూంలో ఇటీవల విధుల్లో చేరాడు. రోజు మాదిరిగానే పనులు ముగిసిన తర్వాత తన సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం పోతునూరుకు వెళ్తుండగా స్థానిక సాగర్‌రోడ్డులో గల టూరిజం హోటల్ ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లేష్‌కు భార్య, ఏడాదిలోపు కూతురు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



మల్లేష్(ఫైల్)

శాంతినగర్‌లో 141 కోడెదూడల పట్టివేత


అనంతగిరి, ఆగస్టు 5: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామం వద్ద ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా కోడెదూడలతో వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని హనుమాన్ జంక్షన్ నుంచి హైద్రాబాద్‌కు 141 కోడెదూడలను ఎక్కించుకుని ఖమ్మం జిల్లా మీదుగా హైదరాబాద్‌కు తరలించేందుకు బయలు దేరారు. మండలంలోని శాంతినగర్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో డీసీఎంలో ఈ 141 కోడె దూడలను గుర్తించారు. వ్యాన్‌ను, అందులో ఉన్నటు కోడె దూడలను హైద్రాబాద్, మఠంపల్లి గోశాలలకు తరలించారు. వ్యాన్ డ్రైవర్లు, గోశాలకు తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులు ఎండి. జలీల్, శర్మ, పఠాన్ వసీంఖాన్, సంతోష్, వడ్లమూడి రాము, షేక్ మహ్మద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



కోడెదూడలను తరలిస్తున్న డీసీఎంను పట్టుకున్న పోలీసులు

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

గుండాల, సూర్యాపేటక్రైం, ఆగస్టు 5: యాదాద్రిభువనగిరి, సూర్యాపేట జిల్లాలో వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. గుండాల మండలంలోని వంగాల గ్రామానికి చెందిన చిప్పలపల్లి కుమారస్వామి(22) ఆరు సంవత్సరాలుగా మోత్కూరులో ద్విచక్రవాహనా మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్‌కు వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వారించారు. దీంతో మనస్తాపానికి గురైన కుమారస్వామి ఈ నెల 3వ తేదీన పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.



కుమారస్వామి(ఫైల్)

మానసికస్థితి సరిగా లేక...

సూర్యాపేట మండలం పిన్నాయిపాలెం గ్రామానికి చెందిన ఉప్పల మురళీ(30) జిల్లా కేంద్రంలోని చింతలచెర్వు వద్ద గల చెరువు కట్ట సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మురళీ మానసికస్థితి కొంతకాలంగా సరిగా లేదు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినప్పటికీ మానసికస్థితి సరిగా లేకపోవడం, కొంతమేర ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో సోమవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి చింతలచెర్వు వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మురళికి భార్య, కుమారుడు ఉన్నారు. మురళి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపారు.

అభివృద్ధి చేస్తా.. వచ్చే ఎన్నికల ఖర్చు మీదే

● మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 5: మునుగోడు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా, అందుకు 2029లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అయ్యే ఖర్చులను ప్రజలే భరించి తనను గెలిపించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2023లో జరిగిన మునుగోడు ఉపఎన్నిక దేశంలోనే ఆసక్తిని కలిగించిందని అన్నారు. తనను ఓడించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కుట్రలు చేసిందని, అప్పటి ముఖ్యమంత్రి, మంత్రులుసహా ఆ పార్టీకి చెందిన 100మంది ఎమ్మెల్యేలు ఇక్కడే తిష్టవేసి డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేశారని ఆరోపించారు. ఓటర్లు పోలింగ్‌కు ముందు రోజు రాత్రి పూట కూడా తమ ఇళ్ల తలుపులు తెరిచే ఉంచి కరెంటు బల్బులను నిలుపకుండా డబ్బులు అందే వరకు నిద్రపోకుండా ఎదురుచూశారంట అని రాజగోపాల్‌రెడ్డి అనడంతో సభికుల్లో నవ్వులు విరబూశాయి. మునుగోడు పరిస్థితి తెలంగాణలో ఎక్కడా లేదని, ఎన్నికలు వస్తే ఇక్కడ పండగేనని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖర్చుల కోసం ప్రజలే డబ్బులు ఎదురిచ్చి తనను గెలిపించాలని కోరారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తనకు పదవులు ముఖ్యం కాదని, ప్రజల బాగోగులకే ప్రాధాన్యం ఇస్తానని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

ముగ్గురు రిమాండ్‌కు తరలింపు

వలిగొండ, ఆగస్టు 5: కిరాణ దుకాణం నడపుతూ మోసపూరితంగా పలువురు నుంచి రూ.కోటి 50లక్షలు అప్పులుగా తీసుకొని ఉడాయించిన ముగ్గురు సోదరు లను సోమవారం అరెస్టు చేసి జ్యూడిషయల్ రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా మండలం లోని గోల్నేపల్లి గ్రామనికి చెందిన కొర్లపల్లి వెంకటేశ్వర్లు, ప్రశాంత్, అనిల్‌కుమార్ అన్నదమ్ములు, జీవనోపాధి కోసం కొన్ని సంవత్సరాల నుంచి అదే గ్రామంలో కిరాణ దుకాణం నడుపుతున్నారు. కిరాణ అవసరాల కోసం వడ్డీకి డబ్బులు కావాలని పలువురిని పదే పదే అడిగేవారు. వారిలో కొందరికి నెలవారిగా వడ్డీలు చెల్లించి రుణదాతలను నమ్మించారు. గుణగంటి హరిక నుంచి రూ.4.30లక్షలు చిరుగోని శ్వేత నుంచి రూ.2.30లక్షలు, మిర్యాల సాయికుమార్ నుంచి రూ.10.50లక్షలు, కుంభ వెంకట్‌రెడ్డి నుంచి రూ.13లక్షలు, మిర్యాల అంజయ్య నుంచి రూ.6లక్షలు, అవుశెట్టి రాములు నుంచి రూ.8లక్షలు అప్పు తీసుకున్నారు. (సుమారుగా కోటి 50లక్షలు) అప్పులుగా తీసుకొని జూలై 15 తేదీన ఇంటికి తాళం వేసి కుటంబసభ్యులందరూ ఉడాయించారు. దుకాణం తెరవకపోయేసరికి అప్పులు ఇచ్చిన వారికి ఆ వ్యాపారులపై అనుమానం కలిగి ఆరా తీయగా, వారు ఉడాయించినట్లు అర్థమైంది. జూలై 23న గంగాపురం దైవాదీనం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తప్పించుకొని తిరుగుతున్న ముగ్గురు అన్నదమ్ములను అరెస్టు చేసి జ్యూడిషయల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రచయిత్రి సుజాతాదేవి మృతి

నల్లగొండ టౌన్, ఆగస్టు 5: రచయిత్రి డొకల సుజాతాదేవి(77) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు సమీపంలోని చింతపల్లి గ్రామంలో 1947 ఏప్రిల్ 26వ తేదీన సీతామహాలక్ష్మి, నాగభూషణం దంపతులకు జన్మించారు. అడవిలో జంతువుల మధ్య సంభాషణలతో కథ నడిపిస్తూ అంతర్లీనంగా అనేక సామాజిక విలువలను బోధిస్తూ ఆమె రాసిన 'ఆటలో అరటిపండు' అనే చిన్న పిల్లల కథా సంకలనానికి 2013లో సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఎంఏ తెలుగు లిటరేచర్ చదివిన సుజాతాదేవి 'ఆహ్వానం' తెలుగు సాహిత్య పత్రిక, ఆంధ్రమహిళా సభ పబ్లికేషన్స్ విభాగం, సీపీ బ్రౌన్ అకాడమీల్లో అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. ఆమె భర్త డాక్టర్ నారాయణరావు ఆడిటర్. వీరికి ముగ్గురు ఆడపిల్లలు సంతానం. పెద్ద కూతురు పద్మజ చిత్రకారిణి, రెండో కూతురు అంజలి సైకాలజిస్ట్, మూడో కూతురు నల్లగొండ పట్టణానికి చెందిన ఏచూరి శైలజ వ్యాపార రంగంలో ఉన్నారు.



అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతి

బీబీనగర్, ఆగస్టు 5: యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని పడమటిసోమారం గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ రమేశ్ సోమవారం తెలిసిన వివరాల ప్రకారం... అశోక్‌నగర్ మల్లాపూర్‌కు చెందిన బొంత ముత్యాలు(60) పడమటి సోమవారం శివారులోని ఓ వెంచర్‌లో నాలుగు నెలలుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి వెంచర్ సమీపంలో బహిర్భుమికి వెళ్లి అక్కడే మృతి చెందాడు. సోమవారం తెల్లవారుజామున ముత్యాలు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ముత్యాలు భార్య నాగమ్మ తన భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పరిసరాల పరిశుభ్రతనే ఆరోగ్యంగా ఉండవచ్చని పలువురు వక్తలు అన్నారు. స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పరిశుభ్రత, మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో పిచ్చి మొక్కలు తొలగించారు. మొక్కలు నాటి సంరక్షిస్తే కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



కోదాడలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ టౌన్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కోదాడలోని లేక్ వ్యూ గెస్ట్ హౌస్ వద్ద ప్రకృతి వనంలో మొక్కలు నాటారు.అనంతరం విద్యార్థినీ, విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నడిగూడెం: స్వచ్ఛదనం- పచ్చదనంపై అవగాహన కల్పిస్తూ మండలంలోని కరవిరాలలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సతీష్‌కుమార్, ఎంపీడీవో ఇమాం, ఎంపీవో విజయకుమారి, డాక్టర్ లక్ష్మీప్రసన్న, వివిధ శాఖల అధికారులుపాల్గొన్నారు.

చిలుకూరు: గ్రామాల్లో పారిశుధ్య పనులను సమర్థంగా చేపట్టాలని ఎంపీడీవో గిరిబాబు సూచించారు. మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, కార్యదర్శి షరీఫుద్దీన్, అంగన్‌వాడీ పాల్గొన్నారు.



సూర్యాపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

సూర్యాపేట టౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. పట్టణంలో నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీని సోమవారం జిల్లా కేంద్రంలోని మునిసిపాలిటీ కార్యాలయంలో ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, కౌన్సిలర్ తాహేర్‌పాషా, డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ప్రసాద్, పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండల కేంద్రంతో పాటు 29గ్రామాల్లో చెత్తా చెదారం పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాములు, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ ధరావత్ లాలు, డాక్టర్ స్రవంతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి



తుంగతుర్తిలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

తుంగతుర్తి: భావితరాలకు పర్యావరణాన్ని అందించాలని ప్రత్యేక అధికారి జగ్గూ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషకుమార్, ఎంఈవో బోయిని లింగయ్య, ఏపీవో కృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, రాములు,పాల్గొన్నారు.

మద్దిరాల: స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి అన్నారు. మద్దిరాల మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛ దనం ..పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో వికాస్ పాటిల్, కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

నూతన్‌కల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో సునీత అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాలలో విద్యార్థులతో కలసి అధికారులు ర్యాలీ నిర్వహించారు.

తిరుమలగిరి, తిరుమలగిరి రూరల్: మునిసిపాలిటీ కేంద్రంలో, మండలంలో నిర్వహించిన పరిశుభ్రత ర్యాలీలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వైస్ చైర్మన్ కేశిడి సరళ, కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, కౌన్సిలర్లు బత్తుల శ్రీను, హన్మంతు, ప్రియలత, కార్యదర్శులు నాగలక్ష్మి, మధు, సరిత, భీంసింగ్ పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలి

హుజూర్‌నగర్: ప్రజలందరూ మొక్కలు నాటాలని మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్‌చిలకబత్తిన కోరారు. సోమవారం పట్టణంలోని గోవిందాపురంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సీతారాములు, శాంతమ్మ, సావిత్రమ్మ, శ్రీదేవి, లక్ష్మీ, ఇందిరాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి పద్మ అన్నారు. మేళ్లచెర్వు గామపంచాయతీ ఆవరణలో కలుపు మొక్కలు తొలగించి స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామంలో మానవహారం నిర్వహించి, తదనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఖాజా అస్గర్ అలీ, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ఆశావర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు

గరిడేపల్లి: గ్రామాల్లో మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ఆర్.సరోజ అన్నారు. స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమం సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని ఇంటి స్థలాల్లో, కమ్యూనిటీ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత, ఏఎన్ఎం కవిత, అంగన్‌వాడీ టీచర్లు సరిత, శ్రీలక్ష్మీస్రవంతి, శ్రీవాణి, అనిత, ఆయాలు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో స్వచ్ఛదనం- పచ్చదనంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సూర్యాపేట టౌన్, ఆగస్టు 5: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు సమీపంలో నూర్ బాషా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డిని, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ సైదా ఖాసిం, ఎండీ అఖిల్‌బాయ్‌ముజీద్, ఎండీ రహమతుల్లా, ముస్తాఫా, అంజద్‌అలీ, ఆయుబ్‌ఖాన్, చెంచల శ్రీనివాస్‌నాయుడు, కోడి సైదులు, బాలుగౌడ్, తంగెళ్ల కర్ణాకర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ కుటుంబానికి ఆర్థికసాయం

నేరేడుచర్ల, ఆగస్టు 5: ఇటీవల అనారోగ్యంతో ఆర్ఎంపీ మల్లిరెడ్డి శ్రీనివాసరెడ్డి మృతి చెందాడు. ఆయన భార్య నీలిమకు సోమవారం నేరేడుచర్ల, పాలకవీడు మండలాల ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం నాయకులు రూ. 31,300 ఆర్థికసాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.భుజంగరావు, పాలకవీడు మండల అధ్యక్షుడు ఎం.పిచ్చయ్య, కార్యదర్శి కె.జానయ్య, షేక్ సైదావలి, నేరేడుచర్ల కార్యదర్శి సైదులు, లింగయ్య, రామచంద్రయ్య, శ్రీరామాచారి, లక్ష్మణాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను పిల్లలు నెరవేర్చాలి

సూర్యాపేట అర్బన్, సూర్యాపేట (కలెక్టరేట్) ఆగస్టు 5: తల్లిదండ్రుల కలలను నెరవేర్చేలా పిల్లలు చదవాలని నవోదయ పాఠశాల కరస్పాండెంట్ మారం లింగారెడ్డి అన్నారు. ఇటీవలి ఫలితాల్లో పంచాయతీరాజ్ ఏఈఈగా నవోదయ పాఠశాల పూర్వ విద్యార్థి కొరణాసి గౌతమ్ ఎంపికయ్యాడు. సోమవారం జిల్లా కేంద్రంలోని నవోదయ పాఠశాలలో గౌతమ్‌ను అభినందించి మాట్లాడారు. నవోదయ పాఠశాలలో గౌతమ్ ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివాడని, తల్లి నవోదయ పాఠశాలలో ఆయాగా, తండ్రి మల్లయ్య పండ్ల వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తూ చదివించారన్నారు. గౌతమ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రజ్ఞ స్కూల్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

మునగాల రూరల్, ఆగస్టు 5: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు ఉండాలని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజ్ఞ హైస్కూల్‌లో సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్‌పై పోలీస్ కళాబృందంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు సన్మార్గంలో ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దన్నారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు వివరాలు, ఓటీపీ ఇతరులకు చెప్పొద్దన్నారు.అనంతరం పోలీస్ కళాబృందం అవగాహన కల్పించింది.. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞ హైస్కూల్ కరస్పాండెంట్ కృష్ణమూర్తి, పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ శివ, కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్య,, గురులింగం, నాగార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టారెడ్డి చిత్రపటానికి పలువురి నివాళి

పెన్‌పహాడ్, ఆగస్టు 5: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, రిటైర్డు ఉపాధ్యాయుడు బైరెడ్డి మట్టారెడ్డి జూలై 26న మృతి చెందాడు. సోమవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సంతాప సభలో పలువురు పాల్గొని మట్టారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూముల భుజంగరావు, నెమ్మాది బిక్షం, జానకిరాంరెడ్డి, సీతారాంరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ ధరావత్ లాలు, ఏపీఎం అజయ్‌నాయక్, ఏపీవో రవి, మృతుని కుమారుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవస్థానం కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

అనంతగిరి, ఆగస్టు 5: మండలంలోని గోండ్రియాల గ్రామంలో ఉమామహేశ్వర దేవస్థానం చైర్మన్‌గా ఎటుకూరి రమేష్ ఎన్నికయ్యారు. సోమవారం దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ చైర్మన్‌గా ఏటుకూరి రమేష్, ఆరుగురు ధర్మకర్తలు మాగి కనకయ్య, శనగపాటి నాగమణి, బండ్ల నాగమణి, చెన్నుపాటి పుల్లయ్య, నెల్లూరు వెంకటేశ్వర్లు, వెలిశాల హనుమాచారి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అధ్యక్షుడు రమేష్, ధర్మకర్తలను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, నాయకులు బుర్రా పుల్లారెడ్డి, బుర్ర ప్రమోద్‌రెడ్డి, బాబునాయక్, బుర్రా నరసింహారెడ్డి, నాగుల్ మీరా, గొట్టిముక్కల బాబు పాల్గొన్నారు.

8న సఫాయి కార్మికుల బంద్

మునగాల రూరల్, ఆగస్టు 5: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8న గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులు చేపడుతున్న సఫాయి బంద్‌కు సహకరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం కోరారు. ఈ మేరకు ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బండారు గురవమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు వాసిమేకల వెంకటేశ్వర్లు, జీపీ వర్కర్ల మండల అధ్యక్షుడు నాగార్జున్, కార్యదర్శి మామిడి వెంకన్న, రాజేష్ పాల్గొన్నారు.

సమగ్ర కార్మిక చట్టం చేయాలి: సీఐటీయూ

కోదాడ రూరల్, ఆగస్టు 5: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కోటగిరి వెంకటనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోదాడలోని సీఐటీయూ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్మానం ప్రకారం వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులకు, స్కీం వర్కర్లకు ఆశాజనకంగా లేదన్నారు. కాటయ్య అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ముత్యాలు, పట్టణ కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాస్, కాటయ్య, కాసాని శ్రీనివాస్,నాగుల్, ఎస్.వీరయ్య, రాముడు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాజీ సర్పంచ్ దాతృత్వం

హుజూర్‌నగర్, ఆగస్టు 5: మండలం వేపలసింగారంలో మాజీ సర్పంచ్ శిరీష కొండారెడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 70 మంది విద్యార్థిని, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. అన్నెం వెంకటరెడ్డి జ్ఞాపకార్థం సైకిళ్లను కుమారుడు, కోడలు అన్నెం కొండారెడ్డి, శిరీషరెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి సారెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గిరిజకుమారి, సైదిరెడ్డి, బ్రహ్మారెడ్డి, హరిలీల, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

‘పోలీసులను విధుల నుంచి తొలగించాలి’

తుంగతుర్తి, ఆగస్టు 5: సైబరాబాద్ పరిధిలోని షాద్‌నగర్ పట్టణంలోని దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను ఉద్యోగం నుంచి తొలగించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రకమల్ల రవికుమార్ కోరారు.. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు బొంగూరు మల్లేష్, బొజ్జ సాయికిరణ్, మధు, మల్లికార్జున్, మధు, నితిన్, ప్రసాద్, బన్నీ తదితరులు ఉన్నారు.

అన్నాచెల్లెళ్లకు ప్రభుత్వ ఉద్యోగాలు



అన్నాచెల్లెళ్లకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 5: అన్నాచెల్లెళ్లు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. సూర్యాపేట పట్టణానికి చెందిన సమ్మెట విజయ్‌కుమార్-రేణుక ఎల్లమ్మ దంపతుల కుమారుడు రాహుల్‌గౌడ్, కుమార్తె ఐశ్వర్య ఉన్నారు. ఇటీవల ప్రభుత్వ విడుదల చేసిన ఫలితాల్లో వీరిద్దరూ ఏఈఈలు ఎంపికయ్యారు. రాహుల్‌గౌడ్ పంచాయితీరాజ్ శాఖలో ఏఈఈగా ఐశ్వర్య పబ్లిక్‌హెల్త్ శాఖలో ఏఈఈగా ఉద్యోగం సాధించింది. అన్నాచెల్లెళ్లు ఇద్దరు ఒకేసారి ఏఈఈలుగా ఉద్యోగాలు సాధించడంతో వారిని బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

త్వరలోనే కళాశాల తరగతులు ప్రారంభం



తిరుమలగిరిలో భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి, ఆగస్టు 5 : సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ ఇంటర్ కళాశాలను మంజూరు చేయించానని, త్వరలో తరగతులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. తిరుమలగిరి పట్టణంలో ఏర్పాటుచేయనున్న ప్రభుత్వ ఇంటర్ కళాశాల కోసం ఇంటర్ బోర్డు అధికారులతో కలిసి ప్రతిపాదిత హాస్టల్ భవనాన్ని సోమవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాల కోసం అనువైన భవనాన్ని పరిశీలించామని, త్వరలోనే తరగతులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డీఐఈవో కృష్ణయ్య, డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై నరేష్ , జుమ్మీలాల్, పేరాల వీరేష్, సుంకరి జనార్దన్ బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన 100మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

బస్ డిపో నిర్మాణానికి చొరవ చూపాలి

తిరుమలగిరిలోనే బస్ డిపో నిర్మాణానికి ఎమ్మెల్యే సామేలు చొరవ చూపాలని కోరుతూ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సామేల్‌కు బస్ డిపో సాధన సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తిరుమలగిరిలో కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్న ఆర్టీసీ డిపోను సాకారం చేసేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో కడెం లింగయ్య, రవిందర్‌రెడ్డి, కొండ సోమయ్య, హన్మంతు, ఉపేందర్, నలుగూరి రమేష్ పాల్గొన్నారు.

కళావేదిక నిర్మాణానికి పూర్వ విద్యార్థుల చేయూత

అర్వపల్లి, ఆగస్టు 5: పాఠశాలలో కళావేదిక నిర్మాణానికి పూర్వ విద్యార్థులు కృషి చేస్తున్నారని తిమ్మాపురం గ్రామస్థులు తెలిపారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామ జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు పాఠశాలలో కళావేదిక నిర్మాణానికి సోమవారం రూ.3లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్థులు మాట్లాడారు. 2012లో ఆ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు రూ.2లక్షలతో అభివృద్ధి చేశారని, పాఠశాలలోని పేద విద్యార్థులకు సహకారం అందజేస్తున్నారని, పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులు సమకూర్చడంతో పాటు క్రీడా సామగ్రి అందజేస్తున్నారని, ర్యాంక్‌లు సాధించిన వారికి ప్రోత్సహకాలు అందజేస్తున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ప్రభాకర్, రవీందర్‌రెడ్డి, చైర్మన్లు శైలజ, స్వప్న పాల్గొన్నారు.



తిమ్మాపురం పాఠశాలలో కళావేదికకు శంకుస్థాపన చేస్తున్న గ్రామస్థులు



సూర్యాపేట కల్చరల్: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా జిల్లా కేంద్రానికి చెందిన బూర వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన నాయకులను కృతజ్ఞతలు తెలిపారు.

సూర్యాపేట: సీనియర్ జర్నలిస్టు బోయిళ్ల చంద్రశేఖర్ (48) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో ఓ దినపత్రిక రిపోర్టర్‌గా 15 సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. స్వగ్రామం నూతనకల్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. చంద్రశేఖర్ కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రశేఖర్ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

హుజూర్‌నగర్: విష జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రశాంతి, పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ లతీఫ్ కోరారు. ం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పరిసరాలు -పరిశ్రుభతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, జయప్రద, రాజు, మాధవి, కరుణ, అభిలాష పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో రోడ్ల నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.232కోట్లు మంజూరు చేయడంపై కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ నాయకుడు షేక్ మన్సూర్‌అలీ హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. సమావేశంలో ఐల వెంకన్న, వల్లబుదాసు కృష్ణ, రజాక్, బాబా, ముస్తఫా, రాములు, జ్ఞానయ్య, జానిమియా పాల్గొన్నారు.

● శ్రావణమాసం సందర్భంగా హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ వేణుగోపాలస్వామి దేవాలయంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, హరీష్‌కుమార్, యరగాని కిరణ్, రమేష్, గోవిందరెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

● తల్లిపాలే శిశువులకు ఎంతో శ్రేయస్కరమని సీడీపీవో వెంకటలక్ష్మి, కౌన్సిలర్ సౌజన్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా హుజూర్‌నగర్‌లోని గోవిందాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతకలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చిలకబత్తిని శాంతమ్మ, కల్యాణి, సోమమ్మ, తిరపమ్మ, జీవమ్మ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో సోమవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరేడుచర్ల: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పారిశుధ్యం, పచ్చదనం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగంతో దుష్ప్రభావాలు తదితర అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బట్టు మధు, వీరబాబు పాల్గొన్నారు.

గరిడేపల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకుడు వార్డు సభ్యుడు నకిరేకంటి సైదులు మృతి పార్టీకి తీరని లోటు అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్‌లు అన్నారు. గరిడేపల్లి మండల కేంద్రంలో సోమవారం ఉదయం గుండె పోటుతో సైదులు మృతి చెందారు. ఆయన మృతదేహానికి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పయిడిమర్రి రంగనాథ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బండ నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ త్రిపురం జయమ్మ, టీడీపీ నాయకులు లింగారెడ్డి, కీసరి నాగయ్య, త్రిపురం సుధాకర్‌రెడ్డి, పొలిశెట్టి అంజయ్యతదితరులు పాల్గొన్నారు.

● జానయ్య మృతి మాదిగ జాతికి తీరని లోటు అని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్ సైదులు అన్నారు. మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన మాదిగ నాయకుడు జానయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ మేళ్లచెరువు వెంకటరమణ, చిటికెల ప్రేమ్‌కుమార్, రణపంగ సైదులు, కుదురు షాము, నందిపాటి మధు, నందిపాటి భాస్కర్, రమేష్, ముత్తయ్య, చిలక సైదులు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: వనమహోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య ఆధ్వర్యంలో మామిడి, ఏగీస, జిట్రేగి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల సిబ్బంది రాజు, ప్రశాంత్, చంద్రకళ, రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఖమ్మం జిల్లా వయా నాయకన్‌గూడెం మీదుగా కూసుమంచి వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించినట్లు డిపో మేనేజర్ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నడిగూడెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి లక్ష్మీప్రసన్న సూచించారు. మండలంలోని కరవిరాల గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సుదర్శన్, సూపర్‌వైజర్ విజయకుమారి, కృష్ణమూర్తి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలుకూరు: పోస్టల్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ హుజూర్‌నగర్ సబ్‌డివిజన్ అధికారి సురేష్ సూచించారు. మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అధికారి కోటయ్య, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, బ్రాంచ్ పోస్టు మాస్టర్ శ్రీనివాస్, పోస్టల్ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నూతన్‌కల్: అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దేవిరెడ్డి నర్సిరెడ్డి కుమారుడు వెంకట్‌రెడ్డి కలిశారు. తెలంగాణ అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు పాలుపంచుకోవాలని సీఎం కోరినట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు.

నూతన్‌కల్: మండల కేంద్రానికి చెందిన విలేకరి బోయిళ్ల చంద్రశేఖర్ మృతి బాధాకరమని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. చంద్రశేఖర్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు భూరెడ్డి సంజీవరెడ్డి, గంట నాగయ్య, దేశోజు మధు, నాయకులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: సీజనల్ వ్యాధులతో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి తాడూరి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కె. సంధ్యారాణి, ఉమారాణి, హెల్త్‌అసిస్టెంట్స్ గాజుల సోమన్న, యాదగిరి, ఏఎన్ఎంలు భారతి, శైలజ, ఉపాధ్యాయులు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దిరాల: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని హెచ్‌ఎం షరీఫ్‌ఉన్నీసాబేగం అన్నారు. నూతనకల్, ఆత్మకూర్(ఎస్), మద్దిరాల మండలాలకు చెందిన లాంగ్వేజ్ పండిట్లుగా ఉన్న 13మంది హిందీ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన సందర్భంగా మండలంలోని గోరెంట్ల గ్రామ జడ్పీహైస్కూల్‌లో కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫరూఖ్, హనుమంతు, రఘు, శ్రీనివాస్, వెంకన్న, నాగమణి, నస్రీన్, ఆరీఫాబేగం, నవీన్ పాల్గొన్నారు.